వేదాంతభేరి

ఆగష్టు 2019

రూ. 10/-

Scanned by CamScanner



12-07-2019వ తేదీ మీర్జాపూర్‌లో జరిగిన
శ్రీసద్గురు మలయాళస్వాములవారి 57వ ఆరాధన కార్యక్రమములు

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీ.శ్రీ.శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము:52 ఆగష్టు 2019 సంచిక : 08

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

Scanned by CamScanner

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 52 ఆగష్టు 2019 సంచిక : 08

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. మోక్షప్రాప్తికై ఎపుడు ప్రయత్నించవలెను
-శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు -06
03. శ్రీ సద్గురు సందేశం - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -14
04. శ్రీరామకృష్ణ బోధామృతము - శ్రీరామకృష్ణ పరమహంస - 17
05. సంక్షిప్త వేద విచారణ - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు -19
06. జ్ఞానసుధ - శ్రీసర్పభూషణ శివయోగి వారు - 21
07. శ్రీమద్భాగవతము షష్ఠమస్కంధము
- శ్రీమాతాపరావిద్యానందగిరిస్వామినివారు - 22
08. శ్రీమలయాళ యతీంద్ర గీత - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 26
09. ఉద్ధవ గీత - శ్రీ యేలేశ్వరపు హనుమరామకృష్ణ - 29
10. తత్త్వసారము తెలుసుకోరన్నా - 35
11. మానవత్వం - మాధవ తత్త్వం - డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్ - 36
12. వార్తలు - 42

ముఖచిత్రం - వటపత్రశాయి శ్రీకృష్ణుడు

14-08-2019 వరాహ జయన్తి **-14-08-2019** శ్రావణ పూర్ణిమ
15-08-2019 స్వాతంత్ర దినోత్సవము
-15-08-2019 అరవింద యోగి జయన్తి
23-08-2019 శ్రీకృష్ణ జన్మాష్టమి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

01. ఓం సచ్చిదానందరూపాయ, విశ్వోత్పత్త్యాదిహేతవే ।
తాపత్రయ వినాశాయ శ్రీకృష్ణాయ వయం నుమః ॥

02 ఓం విశ్వకర్మన్ నమస్తే ఉ స్తు విశ్వాత్మన్ విశ్వసమ్భవ ।
విష్ణో జిష్ణో హరే కృష్ణ వైకుణ్ఠ పురుషోత్తమ ॥

03. ఓం యోని స్తమస్య ప్రలయశ్చ కృష్ణ త్వమేవేదం సృజసే విశ్వమగ్రే।
విశ్వం చేదం త్వద్వశే విశ్వయోనే నమో ఉ స్తు తే శార్ఙ్గచక్రాసిపాణే ॥

04 ఓం శఙ్ఖినే చక్రిణే నిత్యం శార్ఙ్గిణే పీతవాససే ।
వనమాలాధరాయైవ తస్మై కృష్ణాత్మనే నమః ॥

05. ఓం వసుదేవసుతః శ్రీమాన్ క్రీడితో నన్దగోకులే ।
కంసస్య నిధనార్థాయ తస్మై క్రీడాత్మనే నమః ॥

06. ఓం వాసుదేవత్వ మాగమ్య యదోర్వంశే సముద్భవః।
భూభారహరణం చక్రే తస్మై కృష్ణాత్మనే నమః ॥

07. ఓం సారథ్యమర్జునస్యాదౌ కుర్వన్ గీతా ఉ మృతం దదౌ ।
లోకత్రయోపకారాయ తస్మై బ్రహ్మాత్మనే నమః ॥

08. ఓం యః సర్వప్రాణినాం దేహే సాక్షిభూతో హ్యవస్థితః ।
అక్షరః క్షరమాణానాం తస్మై సాక్షాత్మనే నమః ॥

09. ఓం పరః కాలాత్పరోయజ్ఞాత్ పరాత్పరతరశ్చ యః ।
అనాదిరాదిర్విశ్వస్య తస్మై విశ్వాత్మనే నమః ॥

Scanned by CamScanner

4వ అధ్యాయము

మోక్షప్రాప్తికై ఎపుడు ప్రయత్నించవలెను?

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఋషులు ప్రబోధించిన మహోన్నతమగు మోక్షస్థితిని బడయుట కొఱకై జనులు శీఘ్రముగ యత్నము సలుపవలెనేకాని ఏమాత్రము విలంబనము చేయరాదు.

సామాన్యముగ వార్ధక్యములో ఎక్కువమంది మనస్సు స్వతః దైవకార్యములందు ప్రీతికొనుచుండును. ఏలయనగా, ప్రపంచములోని భోగ్యవస్తుజాల మంతయును అనుభవించి, విసుగు జనింప, వానినుండి మరలి దైవము వైపునకు వారు తిరుగుదురు. దృశ్యపదార్థములందు, ధారాపుత్రాదులందు, ధనధాన్యారామక్షేత్రాదులందు, ఏమో సుఖము, శాంతి కలదని భ్రమించి పరుగిడిన వారికి ఎదురుదెబ్బలు తగులగా, వాని నుండి చక్కగా మరలుదురు. ప్రవృత్తిని తగ్గించి నివృత్తిని జేబట్టుదురు. మఱియు ఉద్యోగములనుండి రిటైర్ అగుదురు. కావున బోలెడు సమయము దైవచింతనకు వారికి మిగులును.

ఈ ప్రకారముగ వార్ధక్యమున మాత్రము దైవాన్వేషణ చేయుట అసలు లేనిదానికంటె మంచిదే అయినను అది చాలదు. ఏలయనిన ఆ సమయమున ఇంద్రియములన్నియు శక్తిని కోల్పోయి దుర్బలములై భగవద్ధ్యానమునకు, దైవస్మరణ విచారణాదులకు, తీవ్రతర సాధనలకు బాగుగ నుపయోగపడకుండును. విస్తరినిండ పంచభక్ష్య పరమాన్నములు వడ్డించి రాక్షసులకు పెట్టి, వారు తినగా మిగిలిన పదార్థములను, ఎంగిలి విస్తరాకును దేవతలకు సమర్పించినట్లుగా నుండును. ఈ శరీరమను విస్తరిలోగల జవసత్వమును, బలవీర్యాదులను బాల్యయౌవనకాలములలో

కామక్రోధాది రాక్షసులకు నివేదించి, వారు పీల్చి పిప్పిచేసిన పిదప ఆ నిర్వీర్య దేహమును వార్ధక్యములో భగవానునకర్పించిన ఎట్లుండును? అయితే దీని యర్థము వార్ధక్యములో దైవచింతన చేయరాదని కాదు, చేయవచ్చును (శుభము ఒకింతైనను మంచికొఱకే యగును). కాని అది చాలదు. 'సర్వేషు కాలేషు మామనుస్మర' ఎల్ల కాలములందు నన్ను స్మరింపుము అను శ్రీకృష్ణుని ఆదేశమున కది సరిగా అన్వయించదు. నిజముగ విచారించినచో ఈ భగవత్కార్యము, ఈ దైవధ్యానము, ఈ పరమార్థ సాధన బాల్యయౌవనములందే పూర్తిచేయవలసి యున్నది. అపుడు మంచి ఆరోగ్యము, శక్తి సామర్థ్యములు, ఇంద్రియ పటుత్వము, జ్ఞాపకశక్తి, ధీరత్వము ఉండును. వయస్సు పెరిగిన కొలది అవి క్రమక్రమముగ తగ్గిపోవుచుండును.

మఱియు జీవితము క్షణభంగురము. కనుక వార్ధక్య మనునది రాకపూర్వమే కొందఱికి అది అంతము కావచ్చును. ఇక జీవుడు సాధించినది ఏమి యుండును? అమూల్యమగు ఈ మానవ జీవితము నిష్ఫలమైపోవును గదా! కనుకనే బాల్యయౌవన వార్ధక్యములందును, సర్వకాల సర్వావస్థలయందును భగవత్స్మరణ చేయులాగున గీతయందాదేశింపబడినది. ఒకానొక భక్తుడు భగవంతుని ఈ ప్రకారముగ ప్రార్థించెను.

దేవ త్వదీయ పదపంకజ పంజరాన్త
మద్యైవ మే విశతు మానసరాజహంసః
ప్రాణ ప్రయాణసమయే కఫవాతపిత్తైః
కంఠావరోధనవిధౌ స్మరణం కుత స్తే.

"దేవా ! నీ పాదపద్మములందు నా మనస్సను రాజహంస ఇప్పుడే ప్రవేశించుగాక! ఏలయనిన, ప్రాణ ప్రయాణ సమయమున కఫవాతపిత్తములచే కంఠము నిరుద్ధముకాగా నిన్ను గూర్చిన స్మరణ అపుడు

సంభవింపదు", కావున శరీరము ఆరోగ్యముగ నున్నపుడే జీవితలక్ష్యమగు పరమాత్మ సాక్షాత్కారమునకై మహత్తరమగు యత్న మాచరింపవలయును.

ప్రాప్తేన యేన నో భూయః ప్రాప్తవ్యమవశిష్యతే

తత్ప్రాప్తౌ యత్న మాతిష్ఠేత్కష్టయాపి హి చేష్టయా (వసిష్ఠగీత)

"దేనిని పొందినచో ఇక పొందదగినది ఎయ్యదియు మిగిలి యుండదో, అట్టి అత్మప్రాప్తికై కష్టపడియైనను ప్రయత్నము చేయవలయును" అని వసిష్ఠ మునీంద్రులు శ్రీరామచంద్రునకు హితము చెప్పిరి. మరల దైవస్తువులను చింతన జేయుటవలన అభ్యాస ప్రాబల్యముచే మనుజుడు దైవమునే పొందుచున్నాడు. దీనికే 'అభ్యాస యోగమ'ని గీతాచార్యుడు పేరుపెట్టెను.

అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా

పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచిన్తయన్. (8-8)

"ఓ అర్జునా! మనస్సును ఇతర విషయములపై జొరనీయక, అభ్యాసయోగము నవలంబించి, పరమాత్మను మరల మరల చింతన జేయుచుండినచో మనుజుడు దివ్యమగు ఆ పరమపురుషుని (భగవానుని) తప్పక పొందగలడు" అని చెప్పుటవలన ధ్యానమును, దైవచింతనను జీవితములో ఎల్లవేళలందును లెస్సగ అభ్యసించిననే తప్ప మాయాబంధము నిర్మూలింపబడనేరదని తేటతెల్లమగుచున్నది. కర్మయోగము, భక్తియోగము, జ్ఞానయోగము మొదలగునవికాక మఱియొక క్రొత్తయోగమును గీతయందు భగవానుడు సృష్టించెను. అదియే 'అభ్యాసయోగము'. పై యోగములన్నియు ఈ అభ్యాస యోగముతో కూడిననే వన్నె కెక్కును. ఇది ప్రత్యేకమగు ఒక యోగము కాదు. అన్ని యోగములతో చేరియుండి అనుష్ఠానమును ద్విగుణీకృత

మొనర్చు క్రియయే ఈ అభ్యాసయోగము.

జీవితమంతయు ఏక్రియ నభ్యసించుదురో, అదియే సంస్కార రూపముగ నేర్పడి అంత్యకాలమున అక్కఱకు వచ్చును. జీవితములో ఒక్క పర్యాయమైనను దైవచింతన చేయనివానికి తుదిఘడియలందు దైవస్మరణ కలుగదు. కనుకనే గీతాచార్యుడు "సర్వేషు కాలేషు"- ఎల్లవేళలయందు తన్ను స్మరించవలసినదిగా ఆదేశించెను. గాంధీ మహాత్మునకు దేహవియోగ సమయమున 'హే రామ్' అను రామనామ స్మరణ యెట్లు సంభవించినది? జీవితకాలమున సమయము దొఱికినపుడెల్ల, 'రఘుపతి రాఘవ రాజారాం, పతితపావన సీతారాం' అను పావన నామమును స్మరించుచుండుటవలన. కావున భగవత్స్మరణను అంత్యకాలము వరకు ఆపియుంచక, వార్ధక్యమువఱకు వాయిదా వేయక విజ్ఞులగువారు ఇప్పుడే యద్దానిని ప్రారంభించి ప్రణవాది దివ్యమంత్రములను, పవిత్రములగు భగవన్నామములను సదా సర్వకాలములందును జపించుచు, స్మరించుచు, భావన చేయుచు పాపప్రక్షాళన మొనర్చుకొని, హృదయశుద్ధిని బడసి జీవితకాలముననే సర్వోత్తమ బ్రహ్మపదవి నలంకరించవలయును.

ఏ వస్తువైనను ఉన్నపుడు దాని విలువ తెలియదు. కంటి యొక్క విలువ కండ్లున్నప్పుడు అంతగా తెలియదు. గ్రుడ్డివాడు నేత్రములయొక్క విలువను చక్కగా అంచనా వేయగలడు. చేతులవలనను, కాళ్ళవలనను జనులు ఎంత లాభమును పొందుచున్నారో ఇపుడు తెలియదు. వాటికి వైకల్యము సిద్ధించినపుడు తెలియును. ఆరోగ్యముయొక్క విలువ అనారోగ్యము కలిగినపుడు బాగుగ తెలియగలదు. సూర్యునియొక్క విలువ పగలు గుర్తెఱుగువారు చాల అరుదు. రాత్రి చీకటిలో అవస్థపడునపుడు ఆ సూర్యుడు లోకమున కెంత ఉపకారము

Scanned by CamScanner

చేయుచున్నాడో చక్కగ అనుభూతమగుచుండును. అట్లే శరీర మున్నపుడు దాని విలువ యెంతటిదో మనుజుడు గ్రహించుటలేదు. అది పోయిన పిదప బాధ నొందుచున్నాడు. ఎన్నియో జన్మలు దాటి సుకృత వశమున మానవుడై పుట్టుచున్నాడు జీవుడు.

'కదాచిల్లభతే జన్తుర్మానుష్యం పుణ్యసంచయాత్'

అని గరుడ పురాణమున విష్ణుభగవానుడీ విషయమునే గరుత్మంతునకు తెల్పియుండెను. కావున మానవజన్మ దుర్లభము. కాదు సుదుర్లభమనియే చెప్పవలసి యున్నది. మోక్షమునకు సోపానమువంటిది. పూర్వము సృష్ట్యాది యందు చతురాననుడు (బ్రహ్మ) వృక్షములను, సరీసృపములను, పశువులను, పక్షులను, మత్స్యాదులను సృజించియు వానిచే ఏమాత్రము సంతుష్టిని బొందకయుండెను. కాని తదుపరి మనుజుని సృష్టించి పరమానందభరితుడయ్యెనట! ఏల? బ్రహ్మావలోకమునకు వలసిన బుద్ధిబల మాతనికి మాత్రమే కలదు. తక్కిన జీవరాసుల కది లేదు. ఆ బుద్ధి బలమును సదుపయోగ మొనర్చుకొని పరమార్థలక్ష్యప్రాప్తి యందద్దానిని వినియోగించినపుడు మాత్రమే అది సఫలమగును. లేనిచో, అదియున్నను లేనిదానితో సమానమే యగును. కాని మనుజుడట్లు చేయచున్నాడా? మోక్షసౌధారోహణమునకు భగవానుడొసంగిన ఈ చక్కని సోపానమును మనుజుడు సదుపయోగ మొనర్చుకొనుచున్నాడా? 'హరి' ద్వారమును జేరుటకు యత్నించుచున్నాడా? లేదు. 'అరి' ద్వారమునే తట్టుచున్నాడు. దేవుని కొఱకు దేహమును వినియోగించుచున్నాడా? లేదు. దేహముకొఱకే దేవుని ఉపయోగించుకొనుచున్నాడు. ఈ ప్రకారముగ అమూల్యమగు సదవకాశమును భ్రష్ట మొనర్చుకొని విషయ వ్యామోహయుక్తుడై ఉన్నత శిఖరములనుండి క్రమక్రమముగ దిగజారిపోవుచున్నాడు. చిన్మయుడుగా వెలుగొందవలసియున్న యాతడు

మృణ్మయుడుగ తయారగుచున్నాడు. ఇది చాల శోచనీయము. అతని దౌర్భాగ్య స్థితిని శాస్త్రము లెంత చక్కగ వర్ణించియున్నవో చూడుడు.

స్థాల్యాం వైడూర్యమయ్యాం పచతి తిలఖిలం చాందనైరింధనౌఘైః
సౌవర్ణై లాఙ్గలాగ్రైః విలిఖతి వసుధామర్కతూలస్య హేతోః
ఛిత్త్వా కర్పూరఖండాన్ వృతిమివ కురుతే కోద్రవాణాం సమన్తాత్
ప్రాప్యేమాం కర్మభూమిం న భజతి పురుషో యస్తపో మందభాగ్యః.

'వజ్రవైడూర్యములతో పొదగపడిన పాత్రయందు తెలకపిండిని ఉంచి చందనపు కట్టెలతో దానిని వండుచున్నాడు! జిల్లేడు చెట్లు పైరు చేయుటకొఱకు బంగారపు నాగలితో పొలమును దున్నుచున్నాడు! ఆరిక పైరును సంరక్షించుట కొఱకు అరటిమొక్కలను నఱకి పొలముచుట్టు కంచె నాటుచ న్నాడు! అట్లే కర్మభూమియగు భూలోకమున జన్మించియు ఎవడు తపస్సు నాచరింపడో, దైవమును సాక్షాత్కరించుకొనుటకు యత్నింపడో, ఉత్తమమగు ఈ మానవ శరీరమును తుచ్ఛవిషయ భోగానుభమునందును, నశ్వర ప్రాపంచిక వస్తు సంపాదనమునందును మాత్రము వినియోగించునో, అట్టివాడు మందభాగ్యుడే యగును!' అని శాస్త్రము లుద్ఘోషించుచున్నవి. మహనీయులున్ను హెచ్చరిక చేయుచున్నారు.

కాబట్టి భగవానుడు కరుణించి మానవదేహమను చక్కని ఉకరణమును మనకొసంగినపుడు, అది శిథిలము కాకపూర్వమే దానివలన ఎంత పారమార్థిక లాభమును పొందగలుగుదుమో అంత పొందియే తీరవలెను. ఇట్టి మహదవకాశములు మఱి ఏ యితర లోకముననను, ఏ యితర జన్మయందును గూడ లభింపవు. గాలి వున్నపుడే తూర్పార బట్టవలెను. దీపమున్నపుడే ఇల్లు చక్కపెట్టుకొనవలయును.

Scanned by CamScanner

Strike the iron when it is hot.

'ఇనుము వేడిగా నున్నపుడే దానిని సాగదీయవలెను' చల్లబడినచో వీలుపడదు. కావున దేహముయొక్క విలువను దేహమున్నపుడే బాగుగ తెలిసికొని, దానిచే చక్కటి సాధనలు గావించి చెఱుకునుండి రసమువలెను, పాలనుండి వెన్నవలెను, పంచకోశాంతర్గతమగు పరమాత్మను అందుండి వెలికితీయవలెను (సాక్షాత్కరించుకొనవలెను.)

ఏలయనగా, జీవితము క్షణభంగురమైనది. ఎత్తైన చెట్టుకొమ్మయొక్క చివరి భాగమునగల అకుకొనయందు వ్రేలాడు మంచుబొట్టువలె శరీరము ఏక్షణమున కాక్షణము రాలుటకు సిద్ధముగనున్నది. ఆయువును కొందఱు ఏనుగు చెవితో పోల్చిరి. మఱికొందరు కప్పయొక్క కంఠచర్మముతో దాని నుపమించిరి. కొందఱు మెఱుపువలె అతి చంచలమని సాదృశ్యము చెప్పిరి. కావున దీనిపై విశ్వాసము తగదు. చేయదగిన పారమార్థిక కార్యములన్నింటిని బాల్యయౌవనము లందే పరిసమాప్తము. అవివున్నపుడే సాధనలను గావించి వేయవలెను. ఆరోగ్యము, ఇంద్రియ సౌష్ఠవము, సదవకాశములు తీవ్రముగ ఆచరింపవలెను. వార్ధక్యములో జ్ఞాపకశక్తి తగ్గిపోవును. ఇంద్రియములు సడలిపోవును. శక్తి క్షీణముఖము పట్టును. అట్టితఱి తీవ్రసాధన లొనర్చుటకు అనుకూలత ఏర్పడదు. కాబట్టి–

'గృహీత ఇవకేశేషు మృత్యునా ధర్మమాచరేత్.'

అని పెద్దలు చెప్పినట్లు – మృత్యువు జట్టుపట్టుకొని యున్నట్లు భావించి, ధర్మము నాచరింపవలెను. వాస్తవముగ నిది అతిశయోక్తి కాదు. యథార్థమే. కనుకనే శ్రీ శంకరాచార్యులవారు భగవంతుని గూర్చి ఈ ప్రకారముగ ప్రార్థించిరి.

రోగా ఘ్నదన్తి సతతం ప్రబలాశ్శరీరం

కామాదయోఽ ప్యనుదినం ప్రదహన్తి చిత్తమ్,

మృత్యుశ్చ నృత్యతి సదా కలయన్ దినాని

తస్మాత్త్వ మద్యశరణం మమ దీనబన్ధో ।

"ఓ దీనబంధూ! భయంకరములైన రోగములు నా శరీరమును నిరంతరము సతమతము చేయుచున్నవి. కామక్రోధాదులు చిత్తమును దహించివేయుచున్నవి. మృత్యువు నా ముందు నాట్యము సలుపుచు రోజులు లెక్కపెట్టుచున్నది. కాబట్టి ఇపుడు నీవే నాకు శరణ్యము. పచ్చి కుండలోని నీటివలె ఆయువు నశించి పోవుచున్నది. నూతన యౌవనశోభ మెఱపువలె చంచలముగా నున్నది. వార్ధక్యము ఆడసింహమువలె పరుగిడి వచ్చుచున్నది. కావున ఇపుడు నీవే నాకు శరణ్యము!" శ్రీ శంకరుల వాక్యములు వాస్తవికతను ప్రతిబింబింప చేయుచున్నవి. ప్రతిజీవియు 'మృత్యుసంసారము'న తగుల్కొని యున్నాడు. కావున దానినుండి తప్పించుకొను తెఱవు యోచించుకొనియే తీరవలెను. తానీ ప్రపంచమున ఎన్ని భోగభాగ్యముల ననుభవించినను, మహావైభవములను కండ్లజూచినను, అవియన్నియు బంధనమధ్యమున తాననుభవించినవే యగును. కాబట్టి విషయవిరక్తి గలిగి, భక్తి జ్ఞాన వైరాగ్యాది ముక్తిసాధనలను త్వరితముగ నాచరించి తరించవలెను.

చండీ సప్తశతి

బ్రాహ్మీ, నందజా, రక్తదంతికా, శాకంబరీ, దుర్గా, భీమా, భ్రామరీ అనే ఏడుగురు దేవతామూర్తులకు సప్తసతులు అని పేరు. వారి మాహాత్మ్య వర్ణనలతో కూడిన మంత్రాలున్న గ్రంథానికి చండీ సప్తశతి అని పేరు. దీనిలో 578 మంత్రాలున్నవి. ఉవాచ మంత్రాలు, అర్ధశ్లోక మంత్రాలు, త్రిపాదశ్లోక మంత్రాలతో కలిపి 700 మంత్రాలయ్యాయి. కలియుగంలో చండీ పారాయణకు మించిన శక్తిమంతమైన ఫలసాధనం మరొకటి లేదు.

Scanned by CamScanner

శ్రీ సద్గురు సందేశం

– శ్రీ సద్గురుమలయాళస్వాములవారు

సాధకుడు స్తుతినిందలకు లోనుగాక స్థిరచిత్తుడై దైవనిష్ఠ సలుపుచుండవలెను. పరిశుద్ధాత్మ స్వరూపులగు ప్రియమైన ఆత్మసోదరా! సత్యధర్మములకు లోబడి యేకార్యమునైనను చేయవలయును. అది దైవత్వమునకు గుర్తు. దానికి భిన్నమైనది దయ్యపు స్వభావమే యగును. వీరికి సద్గతి కలుగదు. భక్తివైరాగ్యములు గలిగి నిస్సహాయులై ఉండువారిని ప్రేమించి బ్రహ్మనిష్ఠలో ప్రవేశపెట్టి మనము తిను అన్నములో ఒక్క భాగము పెట్టి అయినా భక్తులకు సహాయపడవలయును. తనయందు దోషము లేక ఒకరు నిందించినను, ఒకవేళ బాధించినను దానివలన సంతోషమును పొందవలసినదే గాని యేలాటి మనోవ్యాకులతను చెందకూడదు. ఈలాంటివి గులుగునపుడు ఆత్మలో (మనస్సులో) ఈ క్రింది విధముగ ప్రశ్నించు కొనవలెను.

(1). దూషణభూషణములో నీకు సమత్వము కలిగినదా?

(2). దూషించువారు దోషములను పంచుకొనువారు కదా! దానివలన యేదైనా కర్మలేశముండిన నశించును కదా! (3). తనయందును, నిందించు వారియందును ఒకే ఆత్మ వస్తువు కలదని బోధ కలిగినదా? (4). దూషించువారి యందు ద్వేషమును, ప్రేమించు వారియందు రాగమున్ను గలుగుచుండిన ద్వంద్వాతీతస్థితి యేలాగున గలుగును?

(5). లోకోద్ధారకులు, మహాత్ములు ఎన్ని బాధలను ఓర్చుకొనియైనను ధర్మమును విడనాడక లోకములో స్థిరమైన జ్ఞానమును ఎటుల ప్రతిష్ఠింప గలిగిరో గదా! అని ఈలాటి భావనలను భావించుకొనిన మనస్సులో

యేలాంటి క్లేశములున్ను గలుగవు. మఱియు సత్యాసత్యములను సర్వేశ్వరుడు ఎరుగకపోడు. ఫలమును గలుగజేయువాడు జగదీశ్వరుడు. నిజము నిలకడమీద తెలియకపోదు. ఎవరినైనా నిష్కారణముగా మనము నిందించియుండవచ్చును. అందువలన ఆ కర్మ ఈలాగున పరిణమించినదని తెలిసికొని మనస్సులో శాన్తి నొందుటయే ఉత్తమమార్గము. ఇట్టి విషయములలో కర్మపై భారముంచవలసినదే. కాని, వర్తమాన కర్తపై కర్తృత్వముంచుట సజ్జన స్వభావము కాదు.

బ్రహ్మనిష్ఠులు అవమానమును అమృతము, సన్మానమును విషము వలెను తలంచవలయును. సన్మానమున పుణ్య క్షయమున్ను కలుగును. 'నిన్దన్తు నీతినిపుణా యదివా స్తువన్తు' అని భర్తృహరి చెప్పిరి. లోకము నిందించినను, స్తుతించినను, ఇప్పుడు మృత్యువును పొందినను, యుగాంతముల వరకు జీవించినను, సత్యధర్మ నిష్ఠులు తమ యొక్క ధర్మపథము నుండి ఒక్క అడుగైనను వెనుదిరగరు. సత్యధర్మములను త్యజించరు. ఇట్టి యోగ్యత కలిగి యుండవలయును. అయితే ఆత్మలో కొంచెమైనను కళంకముండిన అది ఎవరికీ తెలియకపోయినను దుఃఖమే కలుగును.

ఇంతవఱకు యిటువంటి మాటలు వినకపోవుట చేతను, ఎల్లప్పుడు ఇతరుల యొక్క స్తోత్రములలో మునిగి యుండుట చేతను, ఇప్పుడు అటువంటి వాక్యములు చాలా బాధాకరముగ కనిపించును. ఇది సామాన్యముగ అందఱికిని గలిగే స్వభావము. కానీ దీనిని విచారణచే తొలగించుకొనవలయును. సత్యధర్మముల కొఱకును, దైవనిష్ఠ కొఱకును ప్రాణమును బలియిచ్చుటకు సిద్ధముగా వుండవలయును. అప్పుడు మాత్రమే ప్రకృతి తనయొక్క నిరంకుశ శాసనమును తొలగించి ముక్తి మార్గమును ప్రశస్తము చేయును.

Scanned by CamScanner

విరోధులు ఎన్ని వాక్యములు చెప్పినను దానికి ఏలాటి ప్రత్యుత్తరము చెప్పక "ఈలాగున వినవలసిన విధి యున్నదని, అందుచేతనే ఇటుల ఏర్పడినదేగాని చెప్పువారియందు ఏలాటి దోషమున్ను లేదు" అని అతివినయముతో ఎవరైనా అడిగినచో చెప్పుచుండవలయును. అధ్యాత్మ విద్యలో ఇంతకాలముండినను ఇప్పుడొక పరీక్ష తటస్థించినది. దీనియందుత్తీర్ణులైనచో ఒక దుర్గమును దాటినవారలగుదురు. ఇంకను ఈలాటి పరీక్షలను దాటవలసియుండును. అయితే దుఃఖముతో కూడిన పరీక్షను దాటుట అంత గొప్పగాదు. సుఖముతో గూడిన పరీక్షను దాటుట బాహు దుస్తరము. ఈ పరీక్షలోనే అనేకులు తప్పిపోయిరి.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు

ఓం శాన్తి శ్శాని, శ్శాన్తిః ।

(ఇది శ్రీ సద్గురు శ్రీమలయాళస్వాములవారు ఒక సాధకునికివ్రాసినలేఖ- సం).

కంటి ఆనువత్రి నిధికి "త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు" కు ఈక్రింది వారు పైకం పంపినారు

(1).	కె.వి. సుబ్బారావు (గుంటూరు)	-	రూ. 50,000/-
(2).	ఎన్.కమలమ్మ (కీ॥శే॥తులసీరాం భార్య)	-	రూ. 50,000/-
(3).	ఆర్.అరవిందకుమార్ (చెన్నై)	-	రూ. 25000/-
(4).	అత్యం వెంకటాచలం (పెనుగొండ-ప.గో.జిల్లా)		రూ. 20063/-

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు ఈక్రింది వారు పైకం ఇచ్చినారు

(1).	ఆర్.అరవిందకుమార్ (చెన్నై)	-	రూ. 25,000/-
(2).	సూరపనేని పద్మకుమారి (అప్పారావుగారి భార్య)	-	రూ. 20,000/-
(3).	బి.రాధాకృష్ణయ్య (శ్రీకాళహస్తి) (ఆదెమ్మపేర భిక్షానిధి)	-	రూ. 15,000/-
(4).	కాలకొండ రాజ్యలక్ష్మి (ఈదర)	-	రూ. 12,000/-
(5).	ఐ.రవికుమార్ (చైతన్యపురి, హైద్రాబాద్)	-	రూ. 10,000/-

శ్రీరామకృష్ణ బోధామృతము

- శ్రీరామకృష్ణ పరమహంస

మొదట నీ హృదయ దేవాలయమున భగవంతుని ప్రతిష్ఠించు కొనుము. మొదట వాని సాక్షాత్కారము నొందుము. ప్రసంగములు, ఉపన్యాసములన్నియు కేవలము దాని తరువాతి మాట.

ఇతరులకు బోధించుటకు బదులు ఎవరైనను సదా భగవంతుని ఉపాసించుచున్నచో అదియే కావలసినంత బోధ -ప్రచారము. స్వయముగా తాను ముక్తుడు కాబూనువాడే నిజమైన ప్రచారకుడు. ముక్తుడైన వాని కడకు వందల కొలది, వేలకొలది జనులు నానాదిక్కుల నుండియు వత్తురు. వచ్చి వాని బోధలను విందురు. పువ్వు వికసించినంతనే తేనెటీగలు తమంత తామే దానికడకు వచ్చును.

సంఘ సంస్కరణమును గూర్చియూ మాటలాడుచున్నారు? మంచిది. భగవత్సాక్షాత్కారము నొందిన పిమ్మట మీ రది చేయవచ్చును. భగవత్ప్రాప్తికై ప్రాచీన ఋషులు సంసారమును పరిత్యజించిరని జ్ఞప్తియందుంచుకొనుడు. కావలసినది అది ఒక్కటే (భగవత్సాక్షాత్కారమొక్కటే). మిగిలినవన్నియు నిజముగా మీకు కావలసినచో లభ్యమగును. మొదట భగవద్దర్శనము నొంది అటు పిమ్మట ఉపన్యాసములగూర్చి, సంఘ సంస్కరణలను గూర్చియు మాట్లాడుడు.

విద్యాధి దైవతమగు నా జగన్మాత యొక్క కటాక్ష వీక్షణ మొక్కటి ప్రసరించిన జాలును. ఉద్దండ పండితుని సైతము నేలపై ప్రాకు కీటకమువలె గాన్పింపజేయును. అందులకై (దేవి కృపకు) ఆత్మ సమర్పణ గావించుకొని ఏకాంతముగా ధ్యాన ప్రార్థనల నొనరింపుడు.

Scanned by CamScanner

నేను విధించు నియములలో పదునాలువ వంతు మీరు అనుష్ఠించిన ఎడల మోక్షప్రాప్తి- భగవత్ప్రాప్తి మీకు నిశ్చయమని నమ్ముడు. సాక్షాత్కారము కావలయుననిన సాధనలను ఆచరించి తీరవలయును. కాని పరిపూర్ణ శ్రద్ధయున్నచో స్వల్పసాధనయైనను చాలును.

'భగవత్సాక్షాత్కారము ఈ జన్మమున సాధ్యము కానిచో మఱు జన్మమున గల్గును' అను నిట్టి మందబుద్ధియేల? శ్రద్ధాభక్తుల విషయమున ఇట్టి మాంద్యము కూడదు. ఈ జన్మముననే - ఏల? ఈ క్షణముననే భగవత్సాక్షాత్కారము నొందవలయును అను దృఢనిశ్చయముతో భల్లూకపట్టు పట్టిననే గాని పరమపురుషార్థమగు మోక్షము సిద్ధింపజాలదు. మాంద్యమెప్పటికినీ తగదు. బలాఢ్యుడవు కమ్ము. దృఢ విశ్వాసమును బూనుము. 'ఈ క్షణముననే నేను దైవసాక్షాత్కారము నొందవలయును' అని పలుకుము. అప్పుడు నీకు తప్పక విజయము సిద్ధించును.

ఈశ్వరానుగ్రహమను గాలి సర్వదా వీచుచునే యున్నది. సోమరులై సంసార సాగరమున బడియండువారు దాని లాభమును బొందరు. కాని కార్యదక్షులు, బలాఢ్యులు నగువారు తమ మనస్సను తెరచాపను నిండుగా విప్పుకొని అనుకూల వాయువును గ్రహించి శీఘ్రముగా పరమావధిని పొందుదురు.

గృహవైద్యం

1). వేపాకు, పసుపు ముద్దగా నూరి శరీరానికి పట్టించి స్నానం చేస్తే చర్మరోగాలు తగ్గుతాయి.

2). రెండు చెంచాల అల్లం రసంతో ఒక చెంచా తేనె కలిపి త్రాగితే దద్దుర్లు శమిస్తాయి.

3). అవిశె ఆకుతో కషాయం కాచి రోజుకు రెండుసార్లు 20 మి.లీ తాగితే కడుపులో క్రిములు, నులిపురుగులు నశిస్తాయి.

4). అవిశె చెట్టు బెరడును కషాయం కాచి రోజూ తాగితే మలేరియా జ్వరం పోతుంది.

సంక్షిప్త వేద విచారణ
(వేద పరిచయము)

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

విద్ జ్ఞానే, విద్ విచారణే, విద్ సత్తాయాం విదుర్లాభే అను ధాతువులచేత వేద శబ్దము సిద్ధించును. వేదమనగా జ్ఞానమని అర్థం. "వేదయతి యతోధర్మాధర్మ ఇతి వేదః" మానవులు, దేవతలు ఆచరించవలసిన ధర్మములు, విడువదగిన అధర్మములను తెలియజేయునదే వేదము-ధర్మమనగా వేద విహితకర్మ. అధర్మమనగా వేదనిషిద్ధకర్మ.

సత్యం వద, ధర్మంచర, మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవో భవ, అతిథి దేవో, యాని అనవద్యాని కర్మాణి, తానిసేవిత వ్యాని. ఇవన్ని వేదవిహిత ధర్మములు. మా హింసా సర్వాకర్మాణి' ఏ ప్రాణికిని శరీర, వాక్కు, మనస్సులచే బాధ కలుగచేయరాదు. ఏ విధముగానైనా, ఏ సమయములోనైనా త్రికరణములచే ఇతరులను బాధింపరాదు, చంపగూడదు. అసత్యమాడరాదు. తల్లిదండ్రులను, గురువులను, అతిథులను బాధింపరాదు. "మా కలంజం భక్షయేత్" 'మా సురాపానం పిబేత్' గంజాయి, మత్తు పదార్థములైన సురాపానంలు చేయకూడదు. పుచ్చుకొని సేవించరాదు. మాంసాహారాదులు తినగూడదు. ఈ నిషేధ పదార్థములను స్వీకరించుట అధర్మమనబడును, ఇది నిషేధము. వేద విహిత కర్మలనాచరించువారు పాపమును పొందరు. ఈ శరీరమును విడచిన తరువాత మానవ జన్మమునే పొందుదురు. కనుక సత్కర్మల నాచరించుట శ్రేయోదాయకము.

"ఇష్ట ప్రాప్త్య నిష్ట పరిహారయోః అలౌకికము పాయం
యః గ్రంథః వేదయతి సవేదః" (తై॥సం॥భాష్యం॥)

దేవతలగాని, మానవుల గాని, పశుపక్ష్యాదులగాని ఇష్ట వస్తువులు సమీపంలో నుండాలని, ఇష్టం గానివి దూరంగా నుండాలని కోరుదురు.

వేదసిద్ధాంతం పశుపక్ష్యాదులకు లేదు. ఎందుకనగా మనము చెప్పిన విషయములను అర్థం చేసుకొని ఆచరణలో పెట్టుకొనే బుద్ధి వాటికి లేదు. ఉదాహరణకు ఒక పాము పొడిచి కాటు వేయునపుడు ఓ పాముగారూ ! మీ వలన మాకు చాల భయము గలుగుచున్నది. నీవు కాటువేయకు. నీకు మంచి ఆహారాదులు ఇచ్చెదము అని వెయ్యి సార్లు చెప్పినను దానికి తెలియదు. కావున వాటికి పుణ్యపాపముల సంబంధమే లేదు. పిల్లి ఎలుకను తినినను, పాము కప్పను తినినను, కప్ప ఈగలను మ్రింగినను వాటికి పాపము లేదు. వాటికి జ్ఞానమును గ్రహించి మార్చుకొనే బుద్ధియోగ్యత లేదు. కనుక వేదవిధినాచరించుటకు మానవులకు, దేవతలకు మాత్రమే యున్నది. వేద విధి నుల్లంఘించుటచే, గౌతమ శాపమునకు దేవేంద్రుడు గురియైనాడు. వేద విధి మనకందరకు అనివార్యము కావున శ్రీ జగద్గురు శంకరాచార్యుల వారు సాధన పంచకములో "వేదో నిత్యమధీయతాం తదుదితం కర్మస్వ నుష్ఠీయతామ్" వేదము నిత్యము చదువదగినది. అందులో చెప్పబడిన యాగాది సత్కర్మలు నిత్యము ఆచరింపదగినవి.

అపౌరుషేయం వేదం -శ్రుతిః అనుశ్రుతః ఆమ్నాయః, స్వాధ్యాయః త్రయీ మొదలయిన అనేక నామాలతో తనను తాను వ్యవహరించు కొనుచున్నది. అపౌరుషీం, సనాతనం, స్వతః ప్రమాణం. క్రాంతదర్శి, స్వయం జాతం బ్రహ్మ తత్వావబోధకం. పురుషార్థ సాధనం, గురుశిష్య పరంపరాప్రాప్తం అని స్పష్టపడుతుంది. ఇట్టి శ్రుతికి గల నామాలలో "వేదః" అనేది అత్యన్త ప్రసిద్ధము.

ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము అధర్వణ వేదముయని నాలుగు భాగములుగా ప్రసిద్ధి చెందియున్నది.

ఋగ్వేద పరిచయము

ఋచస్తుతే యను ధాతువుచేత ఋక్ శబ్దం అయినది. ఋక్ అనగా స్తుతించమని అర్థం. "స్తుతిర్నామ గుణానువాదః" వస్తువు లేక వ్యక్తియొక్క గుణగణములను, అణువు మొదలు, పరమేశ్వర పర్యంతము ఉన్నది ఉన్నట్లు వివరించడమునే స్తుతి అందురు. (సశేషము)

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు

తెనుగు అనువాదం :
శ్రీ శంకరానందగిరి
స్వాములవారు (లత్తవరం)
(ఉమామహేశ్వర పీఠాధిపతులు)

ధరాదీశ్వరాంతం షడధ్వాత్మవిశ్వం
మనన్ బ్రహ్మ విద్వాన్ హృది స్వస్వరూపమ్,
చ్యుతోపాసనోపాసకోపాస్యభావో
రమ త్యన్వహం నేహ నానా ఽస్తి వాక్యే. ౧౧

ధరా ఆది = భూమి మొదలు, ఈశ్వరాంతం= ఈశ్వరుని వఱకు, షడధ్వాత్మ = షడధ్వాత్మకమైన, (కళలు, వర్ణములు, పదములు, మంత్రములు, భువనములు తత్వము లనెడి యివి స్వరూపముగాగల, విశ్వం=జగత్తును, హృది= హృదయమందు, స్వస్వరూపం=తన (ఆత్మ) స్వరూపముగానే, మనన్=ఎఱుగుచు, చ్యుత ఉపాసనా ఉపాసక ఉపాస్యభావః= ఉపాసన, ఉపాసకుడు, ఉపాస్యము అను నీ భావములు జాఱిపోయినట్టి, బ్రహ్మ విద్వాన్= బ్రహ్మ నిష్ఠుడు, న ఇహ నానాఅస్తి వాక్యే = ఇచ్చట నానాత్వము (ఏ భేదము) లేదని చెప్పెడి శ్రుతి వచనమందు, అన్వహం= నిరంతరము, రమతి= రమించును.

బ్రహ్మవిదునకు ఉపాసన ఉపాసక ఉపాస్య భేదరూపమగు త్రిపుటి అగుపడదు. సముద్రమునందుండిన చేపకు అంతటను జలమే యగుపడినట్లు, ఆకాశమునందు సంచరించు పక్షికి ఎక్కడ జూచినను బయలే యుండునట్లు బ్రహ్మవిదునకు తన కంటె అన్యము తోపదు. అందువలన వానియందు ఉపాసనాభావ మసంభవము.

Scanned by CamScanner

శ్రీమద్భాగవతము షష్ఠమస్కంధము

– శ్రీ మాతాపరావిద్యానందగిరి స్వామినివారు
(యాజ్ఞవల్క్యాశ్రమము)

భాగవతోత్తముల పరమ పవిత్రమైన చరిత్ర "శ్రీమద్భాగవతము". ఇది శ్రీ వేదవ్యాస ప్రణీతము.

భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు
శూలికైన దమ్మి చూలికైన
విబుధజనుల వలన విన్నంత కన్నంత
దెలియవచ్చినంత తేటపఱుతు.

అంటూ వ్యాసభాగవతమును ఆంధ్రీకరించిన పోతనామాత్యుల వారు భాగవతమును చక్కగా తెలిసికొని చెప్పుట శూలమును ధరించు పరమశివునికైననూ, నాభీ (విష్ణుమూర్తి యొక్క) కమలము నుండి ఉద్భవించిన బ్రహ్మదేవునికైననూ చిత్రము అనగా సాధ్యము కాదు. కనుక నేను చెప్పగలను అను ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో, అహంకారంతో కాకుండా ప్రాజ్ఞులైన మహాత్ములవలన నేను విన్నంత, తెలిసినంత, అనుభవమునకు వచ్చినంత తెలియజేస్తానని అన్నారు. అటువంటి.

లలిత స్కంధము గృష్ణమూలము శుకాలాపాభి రామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమన సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసా వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరువుర్విన్ సద్విజశ్రేయమై।

సుందరమైన మొదలుగలది, కృష్ణపరమాత్మయే ఆధారముగా గలది, శుకుని మాటలచే మనోహరమైనది, అనేక సుందరమైన భాగవత చరితలను తీగలచే అల్లుకొనబడినది, మంచి రంగులతో కూడిన అందమైన సువాసన వెదజల్లు పూలవాసనలవలె బాగుగా తెలియబడునది, సుందరములైన ఇతివృత్తములతో కూడినది, గొప్పదగు మోక్షఫలము నిచ్చునది, (విమల) మలరహితుడైన వ్యాస భగవానునిచే రచియింపబడిన భాగవతము కల్పతరువై ఉత్తమ జన్మలకు శ్రేయస్సును కలిగించునదై యున్నది.

అట్టి భాగవతములోని ఆరవ స్కంధములోని విశేషములను బుద్ధికి అందినంత వివరించుకొనుటకు ప్రయత్నించుదాము.

శ్రీ వ్యాసులవారు రచియించిన సంస్కృత భాగవతమునందు ఈ షష్ఠమ (ఆరవ) స్కంధములో 19 అధ్యాయాలు గలవు. శ్రీ పోతనామాత్యులు తెనింగించిన ఆంధ్ర భాగవతమున విషయము అధ్యాయములుగా కాక విషయమును సూచించుచూ వున్నవి. ఉదాహరణకు మొదటి మూడధ్యాయములలో అజామిళుని యొక్క చరిత్ర యున్నది. తెనుగున అజామిళోపాఖ్యానము అను పేరుతో అతని చరిత్ర తెలియజేయబడి వున్నది. ఈ విధముగా ఈ స్కంధమునందు అజామిళుని వృత్తాంతముతోపాటు ప్రచేతసులను చంద్రుడు ఉద్బోధించుట, దక్షోత్పత్తి, ప్రజాసృష్టికొఱకు దక్షుడు శ్రీహరిని గూర్చి తపంబుచేయుట, ఆతనికి పుట్టిన హర్యశ్వ శబళాశ్వులకు నారదుని ఉపదేశంచే మోక్షము పొందుట, ఆ వార్త తెలిసిన దక్షుడు నారదు శపించుట, బ్రహ్మ దేవుని వరముచేత సృష్టి విస్తారము కొఱకు అరువది (60) మంది పుత్రికలను కనుట, వారిలో పదముప్పరను (13) కశ్యపునకిచ్చి వివాహము చేయుట వలన వీరికి జన్మించిన వారి వలన

Scanned by CamScanner

లోకంబులు నిండుటయు, దేవాసుర, నర, తిర్యక్, మృగ, ఖగాదుల జన్మంబులను, దేవేంద్రుని తిరస్కారము వలన బృహస్పతి అంతర్ధాన మగుటయు, ఆ విషయమును తెలిసికొనిన రాక్షసులు గురువైన శుక్రాచార్యుల ఉపదేశము మేరకు దేవతలపై దండెత్తి వచ్చుట, యుద్ధములో ఆచార్యుని తిరస్కరించిన పాపమువలన దేవతలు ఓడిపోయి బ్రహ్మదేవుని మాటను అంగీకరించి త్వష్ట కుమారుడయిన విశ్వరూపుని ఆచార్యునిగా స్వీకరించుట, విశ్వరూపుని అనుగ్రహము వలన ఇంద్రుడు నారాయణను మంత్ర కవచము వలన రాక్షసులను జయించుట, ఇంద్రునికి తెలియకుండ రాక్షసులకు అనుకూలముగా వర్తించుచున్న విశ్వరూపుని దేవేంద్రుడు వధియించుట, అందువలన ఇంద్రునకు బ్రహ్మహత్యాదోషము కలుగగా దానిని భూమికి, జలమునకు, చెట్లకు స్త్రీలకు పంచిపెట్టి ఆ దోషము నుండి విముక్తి పొందుటయు, విశ్వరూపుని మరణమునకు కోపించిన త్వష్ట ఇంద్రుని చంపు కొడుకు కావలయునని మారణ హోమము చేయగా వృత్రాసురుడు జన్మించుట, యుద్ధములో వృత్రాసురుని గెలువలేక పరాజితులయిన దేవతలు శ్రీహరిని ప్రార్థించగా దధీచి వెన్నెముకను తీసికొనవలసినదిగా ఉపదేశించుట. ఇంద్రుడు ఆ వెన్నెముకతో తయారయిన వజ్రాయుధముతో వృత్రాసురుని సంహరించుట, బ్రహ్మహత్యా దోషముచే ఇంద్రుడు మానస సరస్సులోని తామర తూడునందు ప్రవేశించి దాగికొనుట, నూరు అశ్వమేధ యాగంబులు చేసి నహుషుడు ఇంద్ర పదవిని పొందుట, అగస్త్యశాపంబున ఆతడు సురరాజ్యచ్యుతుడై కొండచిలువగా బుట్టుట, ఇంద్రుడు అశ్వమేధయాగంబు జేసి త్రిలోకాధిపత్యంబును పొందుట, చిత్రకేతూపాఖ్యానము మరియు మరుద్గణముల జన్మ వృత్తాంతంబులు మొదలైన చిత్ర విచిత్రంబులైన ఆఖ్యాయికలు ఈ షష్ఠమస్కంధమున కలవు. దేవేంద్రుని మించిన తేజస్సు, యశస్సు, ధైర్య, స్థైర్యములు, ఆయుస్సు కలిగిన సత్సంతానము కొఱకు

చేయవలసిన పుంసవన వ్రత విశేష విధానము కూడా ఈ షష్ఠమస్కంధము నందే వివరించబడియున్నది. కావున విజ్ఞులు ఈ షష్ఠమ స్కంధంలోని విషయాలను ఆసాంతం చక్కగా తెలిసికొని భుక్తి, భక్తి, ముక్తులై తరింతురుగాక!

(శ్రీ శుకబ్రహ్మాశ్రమము వారు 2018 సంవత్సరంలో నెలకొక భాగవత సదస్సు చొప్పున పది భాగవత సదస్సులు నిర్వహించారు. అందు ఒక్కొక్క సదస్సులో ఒక్కొక్క మహాత్ముడు ఒక స్కంధంపై ఏడు రోజులు ప్రసంగించారు. అట్టి భాగవత సదస్సులలో 6వ సదస్సులోని ప్రసంగం ఇది. సం॥)(సశేషం).

ప్రాథమికంగా భగవంతుడు అంటే అంతులేని శక్తి కలవాడు. కాబట్టి పరిమిత శక్తి గల మానవుని కంటే భిన్నమైనవాడు. మానవుడు ఏవో కొన్ని మంచి లక్షణములు ఎన్నో పరిమితులు కలవాడై వుండగా భగవంతుడు అపరిమితమైన, శ్లాఘనీయమైన, లోపరహితమైన లక్షణములు కలవాడు. భగవంతుడు పరిపూర్ణ శక్తిమంతుడే కాక నిస్సహాయ స్థితిలో వున్న మానవుని రక్షించు దయా గుణం, కరుణ కలిగినవాడు అందువలననే భగవంతుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు మరియు అవ్యాజమైన ప్రేమ కలవాడు. ఆ ఆలోచనలను క్రమానుగుణంగా విశదీకరించే విషయంలో ఎవరిద్వారానైతే తమను ఆశ్రయించిన వారిని కటాక్షించుట కొరకు విశదీకరించబడినవో అటువంటి మహనీయుల, ప్రవక్తల, మునుల, మహర్షుల ఆత్మ భావనలను మానవజాతి ఎల్లప్పుడు ఉపయోగించుకోవలసి ఉంటుంది. ప్రాథమికంగా దైవచింతన అనేది భగవత్స్వరూపులైన కొంతమంది మనుష్యుల ఉత్తమమైన లక్షణముల ద్వారా ఏర్పడగలదు. అటువంటి వారు చీకటిని పారద్రోలి వెలుగును ప్రసాదిస్తూ మనలను నడిపించువారు. అందుచేతనే వారిని ప్రతి భావనలో గురువులుగా పరిగణిస్తాము. **– బి.వి.నరసింహస్వామి**

Scanned by CamScanner

శ్రీమలయాళ యతీంద్ర గీత

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య,
(తిరుపతి)

'గీత' అన్న శబ్దం వినగానే మనకు స్ఫురించేది భగవద్గీత. అది ఒక స్వతంత్ర గ్రంథం కాదు. భారతంలో ఒక భాగం. అయినా ఏ స్వతంత్ర గ్రంథానికీ లేనంత ఖ్యాతి దానికి కల్గింది. ఆ గ్రంథ రాజం ప్రతిసంవత్సరం 'జయంతి' ఉత్సవాలను గూడా వైభవోపేతంగా జరుపుకొంటున్నది.

శ్రీ మలయాళ సద్గురు స్వాములవారు, వారి ప్రముఖ శిష్యులు శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారు భగవద్గీతకు కల్గించిన వ్యాప్తి అత్యద్భుతం. విశేషించి శ్రీ విద్యాప్రకాశానందస్వామీజీ గీతామకరంద రచన ద్వారానూ, గీతా యజ్ఞాల నిర్వహణ ద్వారానూ భగవద్గీతను ఇంటింటి గ్రంథంగా రూపొందించడంలో కృతకృత్యులయ్యారు.

శ్రీ మలయాళస్వాములవారు ఆంధ్రావనిలో కనీ, వినీ ఎరుగని రీతిలో ఆధ్యాత్మిక విప్లవం సాధించారు. వారి జీవితమే భగవద్గీతకు భాష్యమని శ్రీ శివానంద స్వాములవారు కొనియాడారు.

శ్రీ మలయాళ యతీంద్రులు నిర్వహించిన వివిధములైన లోకోద్ధారక కార్యక్రమాలలో ఆధ్యాత్మిక గ్రంథ రచన ప్రముఖమైనది. అందుబాటులో లేకుండా పోయిన ప్రాచీన గ్రంథాలకు వ్యాఖ్యాలు వ్రాయించి ప్రకటించడమే గాక శ్రీవారు స్వయంగా పలు వేదాంత గ్రంథాలు రచించారు.

1919లో తిరుమల గోగర్భ తీర్థంలో తపోనిష్ఠలో ఉన్న సమయంలో శ్రీ గురుదేవులు రచించిన శుష్కవేదాంత తమోభాస్కరం అన్న గ్రంథం జడత్వాన్ని దూరీకరించి చైతన్యాన్ని ప్రసాదించే ఉద్గ్రంథంగా విరాజిల్లింది.

శ్రీ స్వాములవారు మొత్తం 57 గ్రంథాలు రచించారు. అందులో

గీతావ్యాఖ్య, కొన్ని ఉపనిషత్తుల వ్యాఖ్యలూ, ఆత్మతత్త్వ ప్రతిపాదక గ్రంథాలు, "లోకోద్ధారకం" వంటి సమాజ సంస్కరణాత్మక రచనలూ ఉన్నాయి. శ్రీవారి రచనల నన్నింటినీ 20 సంపుటాలుగా క్రోడీకరించి 2000వ సంత్సరంలో జరిగిన వ్యాసాశ్రమ వజ్రోత్సవాలలో ప్రచురించడం జరిగింది. ఈ గ్రంథ ముద్రణకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు సహకరించారు.

శ్రీవారి రచనలలో 'శ్రీమలయాళ యతీంద్ర గీత' మిక్కిలి విశిష్టమైనది. భగవద్గీత లాగా అతి ప్రాచీన కాలంలోనే శివగీత, బ్రహ్మగీత, శ్రీరామ గీత, అష్టావక్రగీత, ఉద్ధవగీత, ఉత్తర గీత ఇత్యాదిగా దాదాపు నలుబది గీతలు రచించబడి వున్నాయి. ఆధునిక యుగంలో శ్రీరమణ మహర్షి, శ్రీ సత్యసాయి బాబా మున్నగు ప్రముఖ మహనీయుల ప్రబోధాలు గీతల రూపంలో వెలువడి ఉన్నాయి. ఇవన్నీ సంస్కృత భాషలోనే నిబద్ధ మయ్యాయి. మహాపురుషుల సిద్ధాంతాలు, ప్రబోధాలు 'గీతల' రూపంలో రచింపబడడం ఒక సంప్రదాయంగా రూపొందిందని దీనిని బట్టి గ్రహించవచ్చు.

అందువల్ల కొందఱు బ్రహ్మనిష్ఠులు, సాధు పుంగవులు, పండితులు, నారీమణులు గురుదేవుని ఉత్తమాశయాలన్నీ గీతారూపంలో ఉండడం సముచితమని భావించారు. వారు స్వామినిలా ప్రార్థించారు.

"స్వామీ! ఈ కాలంలో సర్వజనులను తరింపజేసే ధర్మాన్ని నిరూపించు గ్రంథం ఒకటి అవసరమై యున్నది. వర్ణ భేదాలు, కృత త్రేతాది యుగాలు, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు మున్నగు వాటి నిజమైన స్వరూపం తెలియక జనులు అజ్ఞానోపహతులై యున్నారు. శ్రీవారు సకల విధ ధర్మాలను భక్తులకు తెలియజేసి యున్నారు గదా, ఆ దివ్య భావాలను ఒకచోట చేర్చి గీతారూపంలో ప్రకటిస్తే సకల జనోపకారకంగా ఉంటుంది. ఇందుకు సమ్మతించి మమ్మల్ని అనుగ్రహించ ప్రార్థన".

శ్రీ స్వాములవారు భక్తుల ప్రార్థనను సఫలం కావిస్తూ

Scanned by CamScanner

'శ్రీ మలయాళ యతీంద్ర గీత' అనే గ్రంథాన్ని ప్రకటించడానికి నిర్ణయించారు. భక్తులడిగిన వివిధ ప్రశ్నలకు స్వామి సమాధాన రూపంలో స్వయంగా కొన్ని శ్లోకాలు రచించారు. తక్కిన శ్లోకాలను తమ శిష్య ప్రముఖులు మాధవ చైతన్య బ్రహ్మచారి, కృష్ణచరణం, శివచరణం అనే ముగ్గురు సంస్కృత రచనలో నిష్ణాతులైన వారు రచించారు. అలా శ్రీవారి సదాశయాలు శ్లోకరూపం పొందాయి.

భగవద్గీతలో వలె ఇందులో గూడా 18 అధ్యాయాలున్నాయి. ఇందలి మొత్తం శ్లోక సంఖ్య 1120. కర్మ, భక్తి, జ్ఞాన, అష్టాంగాది యోగాలే కాక ఈ గీతలో విద్యాయోగము, స్త్రీ విద్యాధికారయోగము, జాతి నిర్ణయ యోగము, యుగ నిర్ణయ యోగము- మున్నగు విశిష్ట యోగాలను గూడా నిరూపించడమయింది.

వర్ణ వ్యవస్థ, లింగభేద దృష్టి ఇత్యాదుల వల్ల హిందూ సమాజంలో మూఢ విశ్వాసాలు భారతదేశానికి కళంకం ఆపాదించాయి. ఆ మాలిన్యాన్ని కడిగివేయడానికి అవసరమైన చైతన్యదాయకమైన ఉదాత్తాశయాలు శ్రీ మలయాళ యతీంద్రగీతలో పొందుపరచడం జరిగింది.

శ్రీవారు "ఇతరుల ఆత్మోన్నతికి అడ్డుపోకుడు, మీ ఆత్మోన్నతికి అడ్డు గలిగిన తొలగించుకొనుడు. సాధ్యమైనచో ఇతరుల ఆత్మోన్నతికి సాయపడుడు. ఇదే సనాతన ధర్మం" అని ఎలుగెత్తి చాటారు.

ఈ ధర్మ తత్వాన్ని శ్రీ మలయాళ యతీంద్ర గీతలో నిరూపించడం జరిగింది. స్త్రీ విద్య విషయంలోనూ, కులభేదాల విషయంలోనూ, కృతాది యుగాల పట్లనూ జనులకు గల మూఢ విశ్వాసాలను నిర్మూలించడానికవసరమైన ప్రబోధాలు ఈ గ్రంథంలో పుష్కలంగా ఉన్నాయి. ఈ గ్రంథం మొదట1954లో ప్రచురింపబడింది. మరల 2000వ సంవత్సరంలో వజ్రోత్సవాలలో ప్రకటింపబడిన "శ్రీ మలయాళ సద్గురు గ్రంథావళి -20" సంపుటాలలో చివరి సంపుటంలో చేర్చబడింది.

మూలం: శ్రీ వ్యాసమహర్షి

ఉద్ధవ గీత

అనువాదం: యేలేశ్వరపు హనుమరామకృష్ణ

(గతసంచిక తరువాయి)

శ్రీ ఉద్ధవుడు : హే యోగ యోగీశ్వరేశ్వరా! మీరు చెప్పినదంతా శ్రద్ధగా వింటున్నాను. సంతోషం! అయితే కూడా, ఎందుకో నీకు కొన్ని సందేహాలు తీరటం లేదు. నాకు భ్రాంతి కొనసాగుచున్నట్లే వున్నదని అనిపిస్తోంది!. అంతేకాదు. నాలో ఏవేవో క్రొత్త- క్రొత్త అనుమానాలు చిగురిస్తున్నాయి.

మీరు చెప్పుచున్నదేమిటి? విధి -నిషేధాలు (Do's Donts) వేదాలు -శాస్త్రాలు చెప్పుచున్నాయి కదా! అవన్నీ వదిలి వేయమంటారా!

శాస్త్రాలచే చెప్పబడే సాధనలు (చేయవలసినవి) - ప్రతి సాధనలు (వదలవలసినవి) ఆశ్రయించటం -వదలటం చేయనవసరం లేదా?

శ్రోతవ్యం -శ్రుతం (to be listened to and already listened to) అయినట్టి పురాణ ఇతిహాస ప్రవచిత ధర్మాలు పట్టించుకోనక్కర్లేదా?

మీరు చెప్పినదంతా విన్న తరువాత నా మనస్సు భ్రాంతిని వీడటం లేదు - ఎందుకోమరీ, నివృత్తి పొందటం లేదు! ఆత్మయందు నిలవటం లేదు!.

అల్పజ్ఞుడగు ఈ జీవుడు గోపికలవలె దర్శనోత్కంఠత స్పర్శనాకాంక్ష మొదలైన మార్గముల సహాయంతో (లేక) తదితర ఆట-పాటల రూపమైనట్టి వ్రజ గోపికల బాల చేష్టల సహాయంతో పరమాత్మతో మమేకమౌతాడా! సర్వాంతర్యామి -సర్వతత్త్వ స్వరూపుడుగా రూపు చెందుతాడా? మీపట్ల చూపే లోక సంబంధమైన విరహం- తపస్సు, వేదపఠనము ప్రాణాయామాది విధానముకంటే గొప్పవంటారా? మీరు అంటున్నదేమిటో, విడమరచి చెప్పండి!.

Scanned by CamScanner

శ్రీ కృష్ణుడు (పఠ పక నవ్వుతూ)

ఓహో! అల్పజ్ఞుడు - కించజ్ఞుడు అగు ఈ జీవుడు విరహోత్కంఠతతో పరమాత్మత్వమును ఎట్లా సంతరించుకుంటాడనియా, నీ ప్రశ్న? సర్వ ధర్మాలు, విధి నిషేధాలు వదలితే పరతత్త్వంతో ఐక్యత లభించేదెట్టా? - అనిగదా నీ సంశయం?

అసలు ఒక్క ముఖ్యమైన ప్రశ్న?

ఈ జీవాత్మగా కనిపిస్తున్నదెవ్వరు? పరమాత్మయే కదా!

సర్వ విషయమతీతుడు-సర్వ తత్త్వాతీతుడు అగు పరమాత్మ ఒక లీలగా-ఒక క్రీడగా నాద స్వరూపమగు ప్రాణశక్తిని ధరించి సూక్ష్మదేహంలోను (Into Body of Feeling and thought), అటు తరువాత శబ్ద - స్పర్శాది ఇంద్రియములతోను కూడిన స్థూల దేహాలలోను ప్రవేశించి స్వయంకల్పిత దృశ్యరూపమనతగు ఈ జగత్తును ఆస్వాదిస్తున్నాడు. దేహమంతా తన ప్రాణ శక్తితో నింపుతున్నాడు. (మూలాధారాది) చక్రములలో వేంచేసి, పంచతన్మాత్రలు (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు) స్వరము, వర్ణము (గుణ సముదాయము) మొదలైన వాటిని వస్త్రము వలె ధరించుచున్నాడు! అనగా,పంచతన్మాత్రలు- స్వరము-వర్ణములతో కూడిన ఈ పాంచ భౌతిక దేహం ధారణ చేసి, తెలియబడేది అనబడే -వేదశబ్దార్ధ దృశ్యముగా వెల్లడి అగుచున్నాడు! కనుక, ఇక్కడ జీవుడుగా ప్రదర్శితమగుచున్నది... ఆ జీవుడికి దృశ్యము (వేదము -తెలియబడేది)గా వెల్లడి అగుచున్నది కూడా యథాతథంగా పరబ్రహ్మమే సుమా!.

అగ్ని ఆకాశంలో సూక్ష్మరూపంగా వుంటుంది. ఒకడు రెండు కొయ్యముక్కలను ఒక చోటికి జేర్చి ఒరిపిడి కలిగించినప్పుడు నిప్పురవ్వలు

బయల్వెడలుతాయి.

ఆ అగ్నియే ఆహుతి ఇచ్చినప్పుడు (నేయి పోసినపుడు) జ్వాజ్వల్యమానంగా అగ్ని శిఖలతో వెలుగొందుతుంది. అనగా... అగ్ని ఆకాశంలో అప్రకటిత రూపంగాను, కట్టెల ఒరిపిడికి నిప్పురవ్వలుగాను, వెలుగుచున్న కట్టెలపై నేయి పోసినప్పుడు అత్యంత కాంతివంతంగాను వెలుగుచున్నది. అట్లాగే, పరమాత్మతత్త్వమే సర్వాతీతనిర్విషయంగాను, సూక్ష్మ దేహంతోను (Body of feeling and throught), స్థూల దేహం (physical body that is solidly being experienced) గాను ప్రదర్శితమౌతోంది! ఈ విధంగా... అంతా పరమాత్మ యొక్క అభివ్యక్త రూపమేనయ్యా! ఈ జీవుడు, వాక్కు కర్మ, గతి (మార్గము), స్వీకారము, విసర్జనము, ఘ్రాణము,(smelling), రస గ్రహణం (Tasting), దర్శనము (seeing), స్పర్శ (touching), శ్రవణము(hearing), సంకల్పము (ideation), విజ్ఞానము (knowing), అభిమానము (deeming / treating / assuming), ప్రకృతి వ్యాపారము (playing roles in the drama of the world), సత్త్వ-రజ-తమో గుణములు, వాటి వికారములచే కలిగే సుఖదుఃఖానుభూతులు (అధిదైవికము), పంచభూత సమ్మేళన రూపమైన ఈప్రపంచము..... ఇవన్నీ కూడా... ఇదంతా కూడా పరమాత్మయొక్క ప్రదర్శనా విన్యాసమే! దృష్టాంతానికి స్వప్నములో ఉన్నది-కనిపించేదీ...ఆ సర్వములో స్వప్నద్రష్ట యొక్క స్వప్నచిత్కళా విన్యాసము కానిదేది?

అంతేకాదు! పరమాత్మ సర్వదా యథాతథము! స్వప్నంలో ఏమున్నా, ఏమి జరిగినా- జరగకున్నా... స్వప్నద్రష్ట సర్వదా యథాతథము కదా!

ఇంకొక దృష్టాంతం. ఒక చిన్న మఱ్ఱి బీజంలో మహత్తరమైన అంకుర శక్తి వేంచేసి ఉన్నది. అది అప్రదర్శితంగా వున్నది!. ఆ బీజమును నేలలో

Scanned by CamScanner

నాటామనుకో! అప్పుడేమౌతుంది?

ఉద్ధవుడు : అది మహావృక్షమై కొమ్మలు, ఆకులు, వేళ్ళు, కాయలు ఇత్యాధికంగా విస్తరించి కనబడుతుంది.

శ్రీకృష్ణుడు : అట్లాగే సనాతనుడు, ఆదిపురుషుడు అగు పరమాత్మ మొట్టమొదట (బీజంలో భవిష్యత్ అంకుర చమత్కారంగా) అవ్యక్తుడై వుంటాడు. ఆయన త్రిగుణములు ఆశ్రయించి లోక కారకుడగుచున్నాడు. ఏక స్వరూపుడైవుండి, ఒకానొక కాలంలో కళ్ళు-చూపు-నోరు-వాక్కు చెవులు-వినికిడి ఇటువంటి వికారక్రమంగా బహురూపములుగా వ్యక్తుడగుచున్నాడు. దృష్టాంతానికి -గొప్ప నటునియొక్క నటనాచాతుర్యము... ఆతడు స్నేహితులతో ఉన్నప్పుడు అవ్యక్తంగాను, నాటకంలో నటిస్తున్నప్పుడు వ్యక్తంగాను ఉంటుంది. వస్త్రము అంటే ఏమిటి? ధారముల అల్లికయే కదా! జగత్తు అనబడే దృశ్యము పరమాత్మ అనే దూది నుండి తీయబడిన దారముచే ప్రదర్శితమగుచున్న వస్త్రము వంటిది!.

దృశ్యమునకు సంబంధించిన అనుభూతి-అనుబంధ భావనయే సంసారము! ప్రవృత్తిచే సంసారము ఏర్పడుతోంది! ఈ సంసార వృక్షము భోగరూప పుష్ప ఫలములను ఆత్మరూపుడగు జీవునకు అందిస్తోంది.

ఈ సంసార వృక్షము పాప-పుణ్యములు అనే రెండు విభాగములు గల బీజం నుండి పుట్టింది. దృష్టులచే పరిపోషించబడుతోంది.

అపరిమిత వాసనల రాసి (Limitless Bundle of Tendencies) దీని మూల విభాగం. సత్త్వ-రజ-తమో గుణములచే ఈ సంసారవృక్షము యొక్క కాండము రూపుదిద్దుకుని ఉన్నది.

పంచ భూతములు ఈ వృక్షము యొక్క కొమ్మల ప్రారంభప్రదేశం.

11 ఇంద్రియములు, 5 జ్ఞానేంద్రియములు ఈ సంసార వృక్షములోని రసము. రక్తము-శ్లేష్మము ఇందులోని అంతరంగ ద్రావణములు.

సుఖ-దుఃఖములనబడే రెండు వేరైన తియ్యని-పుల్లని పళ్లు దీనికి కాస్తున్నాయి. ఈ విశాల సంసార వృక్షము భూమండలము నుండి అటు ఆకాశమంతా -ఇటు పాతాళంలోకి విస్తరించి ఉన్నది!

జీవుడు -ఈశ్వరుడు అనే జంట పక్షులు ఈ వృక్షమును అంటి పెట్టుకొని ఉన్నాయి! ఈ సంసార వృక్షమును కాముకులైన జీవులు అనే గబ్బిలాయిలు అంటిపెట్టుకొని ఉన్నాయి. వివేకులు, త్యాగ నిరతిగలవారు అగు హంసలు కూడా ఇదే వృక్షమును, ఆశ్రయించి జీవిస్తున్నాయి! వాళ్ళు ఈ వృక్షము యొక్క ఆత్మ సుఖము, అనే రూపముగల ఫలములను సదా రక్షిస్తున్నారు! తాము ఆస్వాదిస్తున్నారు!

ఓ ఉద్ధవా ! వాస్తవానికి ఉన్నది సత్ స్వరూపుడనగు నేనొక్కడినే!

మాయా శక్తి ప్రభావముచే నేనే ఇన్ని రూపములుగా, నామములుగా వ్యవహారములుగా చూడబడుచున్నాను! ఇదియే తత్త్వార్థజ్ఞానం! తత్త్వరహస్యం! అద్వైతం!

ఎవ్వరైతే గురువులను ఆశ్రయించి (ఏకోసత్! విప్రా బహుధా వదంతి) అనే జ్ఞానవాక్యము యొక్క, వేద -వేదాంగములచే గానము చేయబడుచున్న యథార్థతత్త్వము తెలుసుకుంటాడో.. అట్టివాడు విదిత వేద్యుడు, తత్త్వజ్ఞాని అవుతాడు. "నాకు నేనే ఇన్ని రూపనామాలుగా స్వయం (జలమున తరంగాలవలె) అనుభూతమగుచున్నాను!" - అని అతడు గ్రహిస్తున్నాడు!.

Scanned by CamScanner

మిత్రమా! నేను చెప్పుచున్న భిన్నత్వంలోని అంతర్లీన ఏకత్వం (The inner unity in the outward diversity) గ్రహించి సర్వదా గమనిస్తూ ఆస్వాదిస్తున్న గురువులు ఉన్నారు. వారిని సమీపించి సేవించు ! ఏకాంత భక్తి కొరకై ప్రశ్నించి నీ సంశయములను నివర్తించుకో!.

అట్టి ఏకాంత భక్తితో క్రమంగా -నేను విశ్వరూపమగు పరబ్రహ్మమును- అను పరతత్త్వమును ఆశ్రయించు! అట్టి నీ ప్రయత్నముచే నీ ఈ త్రిగుణాత్మకమగు కారణ శరీరము (లేక) త్రిగుణ శరీరము (లేక) త్రిలింగశరీరమును ఖండించివేయి! ఆత్మయందు ఆత్మకు అభిన్నంగా ఆత్మస్వరూపుడవై ఉండు. పరమాత్మ తత్త్వము విను. మననం చేయి. భక్తితో ఉపాసించు! క్రమంగా పరమాత్మ స్వరూపుడవై నీయంధే కల్పితమైన ఆత్మ స్వరూపజగత్తును ఆత్మగా ఆస్వాదించగలవు! ఆ తరువాత జ్ఞానమును అందుకొరకై సాధనలు మొదలైన వ్యవహారాలను కూడా పరిత్యజించు!.

పరమాత్మవై పరిపూర్ణుడవై... నీ యొక్క జీవాత్మత్వమునకు కర్తవు- కల్పించుకొన్నవాడివి. (One who visualized individual self) సాక్షివి...అయి ఉండు! ఆపై ఈ ఆత్మాఽభిన్న జగత్తులో నీ ఇష్టానుసారం ఉండు!. జగత్ రూపుడవై జగత్తును ఆస్వాదించు! జగత్ అతీతుడవై నిర్లిప్త పరమానంద స్థితి నుండి చ్యుతి పొందకు! అచ్యుతుడవై వుండు.

1. తాను చేయవలసిన దానిని సక్రమంగా చేయకపోతే తనకు రావలసినది కూడా సక్రమంగా రాదు.
2. కోపిష్ఠుల అనుష్ఠాలన్నీ కళాయలేని పాత్రలో వండిన పప్పు పులుసు వంటివి. ఉపకారం చేయకపోగా అపకారం చేస్తాయి.
3. లాభాలలోకెల్లా అతి గొప్ప లాభం ఆత్మ లాభం.
4. పాప సంపాదనతో పంచ భక్ష్య పరమాన్నాలను తిని బ్రతకడం కన్నా ధర్మ మార్గ సంపాదనతో అంబలి త్రాగి బ్రతకడం శ్రేష్ఠం.

తత్త్వసారము తెలుసుకోరన్నా !

తత్త్వసారము తెలుసుకోరన్నా !
సద్గురుని చెంత నిజముగనుగొని లాభమొందన్నా!

1. పరమసౌఖ్యమె నీవురోరన్నా
దుఃఖమెన్నడు, లోకమేమియు నీకు లేదన్నా
మనసుచేతనె దుఃఖ మేర్పడు
మనసుదాటిన దుఃఖ మెచట
మనసులేని ఆత్మయందున
ఎల్లవేళల స్థితిని బడయుము. ॥త॥

2. మనసు బుద్ధియు నీవు కాదన్నా
నీ స్వరూపము ఆత్మయేయని తెలిసికోరన్నా
ఆత్మయందున నిష్ఠగలిగి
దృశ్యమందున రోతజెంది
జీవితాంతము కాకపూర్వమె
బ్రమ్మపదవిని బొందు రయమున

3. యత్నమెన్నడు వీడబోకన్నా
మోక్షపదవియు, యత్న ఫలమని యెఱుగుమోరన్నా
సమయమేమియు పాడుచేయక
సాధనంబున చేయుచుండుము
విడువకుండను ఆచరించిన
సత్వరంబుగ ముక్తికలుగును. ॥త॥

4. తత్త్వసారము ఇంతియేయన్నా
విద్యాప్రకాశుని మాటగైకొని ఆచరించన్నా
ఋషులు తెలిపిన శాస్త్రవాక్యము
పరమసత్యము మదిని నమ్ముము
ఉచ్చరించిన గలుగు పుణ్యము
ఆచరించిన గలుగు మోక్షము ॥త॥

Scanned by CamScanner

మానవత్వం - మాధవతత్త్వం

– రచన : డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్

మ ॥ మహిత శ్రావణ మేచకాష్టమీ నిశామధ్యంబునం బ్రస్ఫుర
ద్గ్రహముల్ స్వోచ్ఛ గృహంబులంద కడు విభ్రాజిల్లబుత్రున్‌యదూ
ద్వహుఁబుణ్యాంగన గాంచె విశ్వజగదా ధారోదయున్ ధర్మని
ర్వహణా రంభ ధురీణు నిత్య విభూతావర్ధిష్ణునిం గృష్ణునిన్

అది మధుర. కంసుని చెరసాల. అందు దేవ కీవసుదేవులు బంధీలు. దేవకీదేవి అష్టమ గర్భం ధరించి యుంది. శ్రావణమాసం–కృష్ణపక్షం–అష్టమి తిథి–అర్ధరాత్రి గ్రహాలన్నీ ఉచ్ఛస్థితిలో ఉండగ ఆ దేవకీదేవి మగబిడ్డను కన్నది. అతడే కృష్ణుడు. యదువంశాన్ని ఉద్ధరించేవాడు. ధర్మ నిర్వహణారంభదీక్షాదక్షుడు. సర్వ జగత్తులకును ఆధారమైనవాడు. నిత్యదివ్య జ్ఞానసంపదలో వర్ధిష్ణువైన అక్షర పరబ్రహ్మ. అందుకే ఆ అక్షర పరబ్రహ్మయైన అచ్యుతుని ఆవిర్భావానికి దివిజ సంఘం మురిసి పూలవాన కురిపించింది. దేవదుందుభులు మ్రోగాయి. అప్సరసలు నాట్యం చేశారు. గంధర్వులు గానం చేశారు. సాధువులు, సిద్ధులు, మహర్షి సంఘాలు ఒక్కచోటునకు చేరి ముచ్చటపడినారు. గగన సంచారులైన చారణలు భయాలను వీడారు. సకల విశ్వాలు ఆనందంతో మిన్నందాయి. దేవకీ వసుదేవులు పులకితగాత్రులైనారు. విధి ఆదేశంతో బాలకృష్ణుడు వ్రేపల్లెకు చేరాడు. యశోదానందులకు బిడ్డడైనాడు. పురాకృత పుణ్యతపం ఫలించిందని వారును ముగ్ధులైనారు. కన్నయ్యను ఆడించి, పాడించి, లాలించి, లాలపోసి, పుత్రమమకార మధురిమలలో మునిగి తేలుతూ కాలం కరగించారువారు.

వైకుంఠవాసుడు వాసుదేవుడైనాడు. వాసుదేవుడు వ్రేపల్లె వాసియై

నవనీత చోరుడై, నందనందనుడైనాడు. స్వామి జన్మలో చెరసాలలు కృష్ణజన్మ స్థానంగా పేరును పొందాయి. కంసునకు యోగమాయ ద్వారా మరణమృదంగం విన్పించింది. కాలం సమీపిస్తున్నప్పుడు కావరం కరిగి నీరవకమానదు. మానవీయ మత్సరం, అహంకారం, అధర్మం దైవం ముందు తలవాల్చాల్సిందే. తలలు నేలరాలాల్సిందే.

మాధవుడు మానవునిగ అవనిపై అవతరించాడు. శ్రీరామునిగ వచ్చాడు. రావణాసురుని రాక్షస మూకతో హతమార్చి, రామరాజ్యానికి పట్టాభిషేకం చేసి, ధర్మం యొక్క బలిమిని, కలిమిని ధరణీ ప్రజలకు అందించి, అవతార లక్ష్యాలు ముగియగనే తిరిగి పాంచ భౌతికమైన దేహాన్ని వదలి, వైకుంఠం చేరాడు స్వామి. మానవధర్మం, సామాజిక న్యాయం, భక్తి, శ్రద్ధల విధానాలవైనం, మానవీయ బంధాలు, అనుబంధాలు, సంబంధాల నీతిని, నిరతిని, అనుభూతితో అందించాడు పరమాత్మ. వ్యక్తి ధర్మం– వ్యవస్థ ధర్మం, కర్తవ్యం, కారుణ్య విధానం అన్నింటినీ అమోఘంగా రాముడందించాడు. కృష్ణావతారం విచిత్రమైంది. విశిష్టమైంది. మానవధర్మం ఒక వంక మాధవ మహిమ మరొక వంక చూపుతూ నడచిన అవతారం కృష్ణావతారం. పాంచభౌతికమైన దేహంలో ఉండి, పరమాత్మ లీలలను ప్రదర్శించడం విశేషం.

నిజానికి కర్మలు చేసేవాడు జీవుడు. కర్మఫలం అనుభవించే వాడూ జీవుడే. కర్మ ఫలానికి అధిపతి పరమాత్మ. పరమాత్మే మన కర్మలకు తగిన ఫలాన్ని యిస్తుంటాడు. మరి ఆ పరమాత్మే మానవునిగా అవతరిస్తే దేహధర్మం అనుసరించాల్సిందే. కర్మలు చేయాల్సిందే. కార్మికుడు, శ్రామికుడు, కర్షకుడు మొదలుగ కావల్సిందే. బంధుత్వాలు, అనుబంధాలు, ఆత్మీయతలు, అనురాగాలు అనుభవించాల్సిందే. సమాజంలో తానూ ఒక మనిషిగా లేదా జీవునిగా జీవనం సాగించాల్సిందే. జన్మ లక్ష్యాల సాధనకు జతలు కట్టాల్సిందే. వెతలు దీర్చాల్సిందే, వ్యథలను అనుకరించాల్సిందే. బ్రతుకు బండిని

Scanned by CamScanner

నడపాల్సిందే.

అయితే కృష్ణ పరమాత్మ మానవకర్మలు, అనుబంధాలను అనుసరిస్తూనే మధ్యలో అనేక లీలలను ప్రదర్శిస్తూ మాధవ దేవర హేలా విశేషాన్ని ఆవిష్కరించడం జరుగుతుంది.

మానవత్వమే మాధవతత్త్వం. మానవ మనుగడలో నవ్యత, మాధవుని లీలలలో ప్రభుత ప్రత్యేకతలు. సమదర్శనం, సమభావం, సమయోగం మానవీయతకు నిదర్శనం. మంచికి ప్రాణం పోయడం, వంచనకు విషం పోయడం, మానవధర్మాన్ని, సామాజిక నీతిని బలంగా ఫలంగా ప్రతిష్ఠించడం, ప్రకృతి వికాసానికి, ప్రాణికోటి హితవునకును సహకరించడం మాధవుని నీతి, రీతి, నియతి. మానవస్వభావం మంట కలసిపోతున్నప్పుడు, మానవీయ ధర్మం మసక బారుతున్నప్పుడు, సాధువుల బాధలను దీర్చడానికి, దుర్జనులను శిక్షించడానికి, ఉపద్రవాల నుండి, విఘాతాల నుండి రక్షణ కల్పించడానికి పరమాత్మ విచిత్రములైన జన్మలను పొంది, కర్మతంత్రుడై లోకహితాన్ని అందిస్తాడు. ఇలా సహస్రాది అవతారాలను స్వామి ధరించాడు. అయితే అందులో ముఖ్యమైన వానినే ఏకవింశతి అవతారాలని, దశావతారాలని మనం చెప్పుకొంటున్నాం. నిజానికి విశ్వపరాయణుడైన నారాయణుని అవతారాలు అసంఖ్యాకమే. ప్రతి అవతారం ప్రత్యేకమైంది. అందునా కృష్ణావతారం మధుర మోహనం, జగన్మోహనమైంది. స్వామి మధురాధిపతి కదా! మహాకవి క్షేత్రయ్యగారు మువ్వగోపాలుని

ఎంత చక్కనివాడే నా సామి వీడెంత చక్కనివాడే

ఇంతి మువ్వగోపాలుడు, సంతతము నామదికి సంతోషము చేసినే

మొలక నవ్వులవాడే ముద్దు మాటలువాడే

తళుకారు చెక్కుటద్దములవాడే

తవిరాకు జిగి దెగడదగుజిగి మోవివాడే

తెలిదమ్మిరేకు కన్నుల నమరువాడే .... ఎంత ॥

చిరుత ప్రాయమువాడే చెలువొందు విదియచం

దురుకేలు నొసలచే మెరయువాడే

చెఱకు విల్తుని గన్న దొరవలె ఉన్నాడే

మెరుగు చామన ఛాయమేనమరువాడే ఎంత ॥

పొందలు కెందామరలు పెంపొదవు పదములవాడే

కొదమ సింగపు నడుము కొమరమరువాడే

మదకరి కరముల మరువు చేతులవాడే

సుదతీ ! మువ్వగోపాలు డెంత సొగసుగలవాడే...

అంటూ స్వామి సోయగాన్ని ఆవిష్కరించారు తమ పదకవితలో మొలకనవ్వులు, ముద్దుమాటలు, చెక్కుటద్దాలు, ఎర్రని పెదవి, తెలిపద్మపు రేకుల కన్నులు, విదియ చందురుని నొసలట. అదే అరచందమామ. మన్మథుని కన్న దొరయట. మన్మథుని మించిన అందగాడు అని, మన్మథునికే తండ్రి కదాస్వామి కనుక మన్మథుని బాబులా ఉన్నాడని గడసరి మాట క్షేత్రయ్య గారిది. శ్యామల వరంగల శరీరం, ఎర్రతామరలనుమించిన పాదాలట, సింహపు నడుము, ఆ నడుమే నరసింహాన్ని చేసింది స్వామిని. ఇలా స్వామి అందాన్ని పద కవిత ఆవిష్కరించింది. నారాయణ తీర్థులవారు

ఆలోకయే శ్రీ బాలకృష్ణం సఖి

ఆనంద సుందర తాండవ కృష్ణం

Scanned by CamScanner

నవనీత ఖండ దధిచోర కృష్ణం- భక్త

భవపాశబంధ మోచన కృష్ణం" అంటూ తాండవ కృష్ణుని ఆనంద సుందరంగా పాడి తరించారు. అన్నమయ్య

ముద్దుగారే యశోద ముంగిట ముత్యమువీడు

తిద్దరాని మహిమల దేవకీ సుతుడు... అంటూ నవరత్న కాంతులతో అర్పిస్తూ వేంకటాద్రిపై యింద్రనీలమే ఈ కన్నయ్య. ఆయనే శ్రీమద్వేంకటపతి అని మ్రొక్కాడు. లీలాశుకులవారి శ్లోకం.

"కస్తూరీతిలకం లలాటఫలకే... జగద్విదితం. అలాగే పోతనగారు "నల్లనివాడు పద్మనయ నమ్ములవాడంటూ" గోపికలతో కన్నయ్యను వెదకించిన తీరు మనోజ్ఞం.

ఇలా కవుల కవనాలలో సుమధురమైన రీతిలో అందాలను ఆవిష్కరించిన కన్నయ్య చిన్ననాడే అమ్మ యశోదమ్మకు తన నోటిలో సకల బ్రహ్మాండాలను చూపాడు. పూతనాది రక్కసుల ఉసురులు దీశాడు. కాళీయుని మర్ధించాడు. బృందావనంలో గోపికలతో విహరించి, ఆత్మ పరమాత్మల సనాతన బాంధవ్యాన్ని, సువ్యక్తం చేశాడు. మధుర భక్తి, అనన్యభక్తి ప్రపత్తులకు శ్రీకారం చుట్టాడు. ఇదియంతా ఒక యెత్తుకాగా కురుపాండవుల కథలో రాజనీతిజ్ఞునిగా రాజకీయం నడిపాడు. రణతంత్రపు నీతిని చాటాడు. కుటుంబ పెద్దగా రాయబారం నిర్వహించాడు. అధర్మాన్ని, అన్యాయాన్ని, తలకెక్కిన అహంకారాన్ని వాని వినాశాన్ని వివరించాడు. అప్పటికే దాదాపు 80 సంవత్సరములు స్వామి మానవ దేహానికి నిండాయి. ధర్మయుద్ధం కురుక్షేత్ర మహా సంగ్రామానికి తెరదీశాడు. ఇక్కడ స్వామి విశ్వగురువుగా భగవద్గీతను బోధించాడు. కాదు గానం చేశాడు.

శ్రీకృష్ణావతారంలో గీతాగానం ఒక ప్రముఖమైన ఘట్టం. గీత మానవ జీవనవేదం. మత గ్రంథం కాదు. మానవ బ్రతుకు. సమస్యలు -పరిష్కారాలు - మనిషి మనుగడలో రావల్సిన మార్పులు -పొందవలసిన జ్ఞానం విజ్ఞానం - ఆధ్యాత్మిక భావనా రీతి- సంప్రదాయపు నీతి- ఆవిష్కరించిన విధానం, వివరించిన పద్ధతి సార్వకాలికమైంది. గీత పుట్టి 5000కు పైగా సంవత్సరాలు గడచాయి. అయినా అది నిత్యనూతనమే. మానవునిగా జన్మించిన ప్రతివాడు గీతను అధ్యయనం చేయాల్సిందే. అంతటి ప్రామాణికమైనది గీత. సార్వకాలికం, సార్వదేశికం, సార్వజనీనమై వెల్గొందిన ఒకే ఒక్క గ్రంథం గీత.

శ్రీకృష్ణ పరమాత్మ 125 సంవత్సరములు నిండు జీవితం గడిపినట్లు పెద్దలు చెప్తున్నారు. 125 సంవత్సరములు నిండిన తరువాత కూడా పూర్తి జ్ఞానంతో పురాకృతకర్మ వెన్నంటి బోయవాని బాణరూపంలో వచ్చి అరికాలు గాయం కావడం కారణంగా దేహత్యాగం చేశారు.

కర్మము చేతనే జీవుడు జన్మిస్తున్నాడు. కర్మ వలననే మరణిస్తున్నాడు. జీవుని సుఖదుఃఖాలకు కర్మలే కారణం. నిష్కర్ముడైన స్వామి మానవ రూపంలో వచ్చి మనకందించిన నీతి యిది. "పిరికితనం వద్దు. హృదయ దౌర్బల్యం తగినది కాదు. కర్తవ్య కర్మలను నిష్కామబుద్ధితో నిర్వహించు. అధైర్యం, స్వధర్మాచరణకు ఆటంకం. వివేచనా బుద్ధికి విఘాతం. అనిత్యమైన బంధాలు, బంధుత్వాలకై పరితపించడం వెర్రితనం. మానవుడు స్వధర్మాచరణలో, కర్తవ్య నిర్వహణలోనే కృతకృత్యుడవుతాడు." అన్న స్వామి సందేశం ఏనాటికినీ శిరోధార్యమే.

స్వామి జన్మాష్టమీ పర్వదినాన, ఒక్కమారు గీతను చదువుదాం. ఎన్నిమార్లు చదివినా స్వామి సందేశాలు నిత్య నూతనం, సత్య సనాతనం, జీవహితం. మొత్తంగా లోకకల్యాణం.

Scanned by CamScanner

వార్తలు

(01). అనంతపురం జిల్లా, ఉరవకొండ సమీపం లత్తవరం గ్రామంలోని శ్రీఉమామహేశ్వరరాశ్రమంలో శ్రీమదుమామహేశ్వర పీఠాధీశ్వరులుబ్రహ్మలీన ప.ప.పూజ్యశ్రీ శంకరానందగిరిస్వాములవారి శతజయన్త్యుత్సవాలు 28-06-2019 నుండి మూడురోజులు జరిగినవి. ప్రస్తుత పీఠాధిపతులు పూజ్యశ్రీ ప్రణవానందగిరిస్వాములవారి అధ్యక్షతన చాలా గొప్పగా జరిగినవి. అందులో కర్ణాటక నుండి, ఆంధ్రప్రదేశ్ నుండిఅనేకమంది మఠాధిపతులు, మహాత్ములు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 28,29 తేదీలందు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారున్ను పాల్గొన్నారు. ఆ తరువాత అదే పీఠశాఖ కొక్కరచేడులోని శ్రీ శంకరానందగిరి గురుసేవాశ్రమంలో ఆశ్రమాధిపతులు పూజ్యశ్రీ గురుచరణానందగిరి మాతాజీ గారిచే నిర్వహింపబడిన శ్రీ శంకరానందగిరి స్వాములవారి శతజయంత్యుత్సవాలలో 30 తేదీన పూజ్య శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొన్నారు.

(02). 9-07-2019వ తేదీన త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుబోర్డు సమావేశం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరిగినది.

(03). కృష్ణాజిల్లా, నూజివీడు మండలం, మీర్జాపురంలో జూలై 11,12,13 తేదీలలో జరిగిన పరమ పూజ్య సద్గురు మహర్షి మలయాళస్వాములవారిఇ 57వ ఆరాధనోత్సవాలలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొన్నారు. మఱియు పూజ్యశ్రీ దండి నిర్మలానందగిరిస్వాములవారు (అష్టలక్ష్మీ పీఠాధిపతులు- తెనాలి), పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు (దత్తాత్రేయాశ్రమాధిపతులు), పూజ్యశ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు (శ్రీ శుకబ్రహ్మాశ్రమము), పూజ్యశ్రీ మాతా జ్యోతిర్మయానంద భారతి స్వామినివారు (షణ్ముఖానందాశ్రమాధిపతులు) డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు (టి.టి.డి.పురాణ ప్రాజెక్టు ఆఫీసర్, తిరుపతి) పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సద్గురు శ్రీ మలయాళస్వామి గీతా ప్రచార సమితిచే ఆ సమితి సంస్థాపకురాలు మాతృశ్రీ అనసూయమ్మ గారి ఆధ్వర్యంలో చాలా విశేషంగా జరిగినది.

(04). సద్గురు మాలయాళస్వాములవారి ఆరాధనోత్సవము శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో 12-07-2019 తేది జరిగినది. పరమ గురుదేవులకు ఆశ్రమ వాసులు, పరిసర భక్తులు షోడశోపచార పూజ చేశారు. ఈ కార్యక్రమం బ్రహ్మచారి విజయానందగారి ఆధ్వర్యంలో జరిగినది. అన్న సంతర్పణ జరిగినది.

(05). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో జూన్ నెలలో ఓ.పి. విభాగంలో **1148** మందికి కంటి పరీక్షలుచేసి తగుచికిత్సలు చేశారు. 101 మందికి కళ్ళలో పొరలు తీసివేసి లెన్సు అమర్చినారు. 9 మందికి యాగ్‌లేజర్ చికిత్స చేశారు. 4 గ్రామీణ వైద్య శిబిరాలు నిర్వహించారు.

(06). 9-07-2019 తేది త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుబోర్డు సమావేశం జరిగినది.

28-06-2019 లత్తవరంలో జరిగిన శ్రీఉమామహేశ్వర పీఠాధిపతులు
పూజ్యశ్రీ శంకరానందగిరిస్వాములవారి శతజయంతి కార్యక్రమములు

Scanned by CamScanner

Regd.No. TRP / 123 / 2018 - 20 August 2019 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-07-2019, Permitted to post : 29th, 30th every month.



16-7-2019 గురుపూర్ణిమ నాడు

శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో గురుపాదుకులకు పూజ

శ్రీసద్గురు సేవాట్రస్ట్ (శ్రీశుకబ్రహ్మాశ్రమం) వారిచే

పాఠశాల బాలబాలికలకు స్కూలు ఫీజుల చెక్కులు ఇచ్చుట

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

Scanned by CamScanner